క్లుప్తంగా

నేడు 'తన్నీరు' పర్యటన

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు గురువారం వత్సవాయి మండలంలోని పాతవేమవరం గ్రామంలో పర్యటించనున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల గ్రామంలో ఆయన పర్యటించనున్నారు. ఉదయం 9తొమ్మిది గంటలకు వేమవరంలో పర్యటన ప్రారంభమవుతుందన్నారు. ఇటీవల వరదలకు ఆయా గ్రామాల్లో నష్టపోయిన రైతులను తన్నీరు కలిసి మాట్లాడతారని ఆ ప్రకటనలో వివరించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వీరులపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు నూరుశాతం పనులు కల్పించాలని ఏపీవో జనార్దన్ సూచించారు. మండలంలోని జుజ్జూరులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25కు సంబంధించి ఆయా గ్రామాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. వ్యవసాయ కూలీలకు నూరు శాతం పనులు కల్పించటమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ కోటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు



బూచవరం(జగ్గయ్యపేట): మండలంలోని బూచవరం సచివాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రాధికారాణి మాట్లాడుతూ ప్రభుత్వం భూములకు సంబంధించిన సమస్యలను గ్రామసభ ద్వారా రైతులు అర్జీల ద్వారా దరఖాస్తు చేసుకునేలా సభలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో భూసర్వే కొంత మేర జరిగిందని పట్టాదార్ పాస్ పుస్తకాలలో పేర్ల మార్పులు, చేర్పులు సవరించాల్సి ఉందన్నారు. పొలం గట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 17 అర్జీలు అందినట్లు వివరించారు. మండల సర్వేయర్ అనూష్, ఆర్‌ఐ సూరమ్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బహిరంగలేఖ

కంచికచర్ల : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కంచికచర్ల పట్టణం నుంచి జుజ్జూరు వెళ్లే రోడ్డు అభివృద్ధికి నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తగిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు, కంచికచర్ల–6 ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈరోడ్డు అభివృద్ధికి డిమాండ్ చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, అధికారం చేపట్టాక పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కంచికచర్ల–జుజ్జూరు రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ముందుకు సాగుతోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. తన నివాసంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 4 మండలాలకు ఉపాధి హామీ పథకం కింద రూ.17 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈనిధులతో 40కిలోమీటర్ల మేర సీసీరోడ్డు, 10కి.మీ మేర డ్రైయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. ఆయా పనులను జనవరిలోగా పూర్తిచేస్తామన్నారు. ఈనెల 26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. త్వరలోనే నీటిసంఘాలు, సొసైటీల ఎన్నికలు జరగనున్నాయన్నారు. కృష్ణా,గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజాను ఎన్డీఏ కూటమి ప్రకటించిందని, గ్రాడ్యుయేట్లంతా ఆయన గెలుపునకు కృషిచేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, యానాల గోపీచంద్, కానూరి కిషోర్, పొట్టపొంగు బాబురావు, నటుకుల బాబురావు, సుభాష్ పాల్గొన్నారు.

గట్టు.. గుటుక్కు

కొంగర మల్లయ్య గట్టుకు కన్నం

- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమరవాణా
- గట్టును తొలుస్తున్న మైనింగ్ మాఫియా
- టిప్పర్ గ్రావెల్ రూ.3వేలకు విక్రయం
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు



గట్టు వెనుకభాగంలో అక్రమంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలు

గట్టుభీమవరం(వత్సవాయి): అక్రమ గ్రావెల్ తవ్వకాలతో కొంగరమల్లయ్యకు గట్టుకు కన్నం పెడుతున్నారు. గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉండడంతో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా గట్టును తవ్వి సొమ్ముచేసుకుంటున్నారు. గట్టు నుండి రోజు వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం గట్టువైపు కన్నెత్తి చూడకపోతుండటంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు.

ప్రశ్నార్థకంగా గట్టు ఉనికి...

అక్రమ తవ్వకాలతో జాతీయ రహదారికి అనుకుని ఉన్న కొంగర మల్లయ్య గట్టు ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుంది. 135.64ఎకరాలలో కొంగర మల్లయ్య గట్టు ఉంది. ఈ గట్టుపై ప్రసిద్ధ శైవక్షేత్రం కూడా ఉంది. అంతేకాకుండా పోలీస్‌శాఖకు చెందిన వైర్‌లెస్ వ్యవస్థ కూడా గట్టుపై ఉంది. కొందరు దాతలు భక్తులు గట్టుపై ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా రహదారి నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ప్రతి శివరాత్రి పర్వదినాన భక్తులు వాహనాలపై, నడుచుకుంటూ వెళ్లి గట్టుపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటారు. అంతటి పురాతన గట్టు వెనుక భాగం నుంచి అక్రమార్కులు గ్రావెల్‌ను తరలించి సొమ్ముకుంటున్నా అధికారుల్లో చలనం లేదు. ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోవడం లేదు.



కొంగర మల్లయ్య గట్టు

అనుమతులు లేకుండానే..

ఇంతటి ప్రాధాన్యం ఉన్న కొంగర మల్లయ్య గట్టు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా ఖచ్చితంగా ప్రభుత్వ అనుమతులు కావాలి. కానీ అక్రమార్కులకు అవేవి పట్టడం లేదు. యథేచ్ఛగా పట్టపగలే పెద్ద ప్రొకెయిన్లు ఏర్పాటు చేసి గట్టు తొలిచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. దీంతో గట్టు వెనక భాగంలో సుమారు 20 అడుగుల మేర గోతులు ఏర్పడ్డాయి.

టిప్పర్‌కు రూ.3వేలు వసూలు..

గట్టు నుంచి భారీగా గ్రావెల్‌ను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు. టిప్పర్ గ్రావెల్‌ను గట్టు వద్ద రూ.3వేలకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌కు రూ.500 వసూలు చేస్తున్నారు. ఈ ట్రాక్టర్లు, టిప్పర్ల నిర్వాహకులు ఆ ఆ గ్రావెల్‌ను గ్రామాల్లో మెరక చేసుకునేందుకు అవసరమైన వారికి దూరాన్ని బట్టి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్ముకుంటున్నారు. రాత్రి, పగలూ లేకుండా ఇలా నిత్యం గట్టు నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రావెల్‌కు ఈ ప్రాంతంలో ఉన్న డిమాండ్ సైతం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ గ్రావెల్ అక్రమ రవాణా వ్యవహారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ గ్రావెల్ అక్రమరవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ గ్రావెల్ అక్రమ తరలింపు వ్యవహారంపై 'సాక్షి' వత్సవాయి తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

నేడు రక్తదాన శిబిరం

కంచికచర్ల : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచికచర్ల ఓసీ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 10గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్ బుధవారం తెలిపారు. ఈ శిబిరాన్ని జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ప్రారంభిస్తారన్నారు. నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పోలీసులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయనున్నట్లు సీఐ వివరించారు.

రక్తదానం చేయాలని పిలుపు..

పెనుగంచిప్రోలు: కంచికచర్ల ఓసీ క్లబ్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేయాలని పెనుగంచిప్రోలు ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసేందుకు ఆసక్తిగలవారు 08678–293233, 9440796463 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలో గొర్రెలు, మేకలకు బుధవారం సామూహిక నట్టల నివారణ మందులు వేశారు. ఈసందర్భంగా ఏడీ వెంగళరావు మాట్లాడుతూ నట్టల నివారణ మందులతో జీవాలలో మంచి ఎదుగుదల వస్తుందన్నారు. విత్తన పొట్టేళ్లను మందల మధ్య మార్పిడితో ఆరోగ్యవంతమైన జీవాల సంపదను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డి.అర్చన, జీవాల పోషకులు, రైతులు పాల్గొన్నారు.





కంపచెట్లు పెరిగి అధ్వాన్నంగా ఉన్న జగ్గయ్యపేట జెడ్పీ బాలికల హైస్కూల్ క్రీడా మైదానం

చిట్టడవిని తలపిస్తున్న పాఠశాల క్రీడామైదానం



జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడామైదానం చిట్టడవిని తలపిస్తోంది. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలంటూ సూక్తులు చెబుతున్న విద్యాశాఖాధికారులు విద్యార్థులకు తగిన క్రీడామైదానాన్ని అందుబాటులోకి తెచ్చే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నరనడానికి నిరుపయోగంగా మారిన ఈ క్రీడామైదానమే నిలువెత్తు నిదర్శనం. శతాబ్దానికిపైగా చరిత్ర ఉన్న ఈ పాఠశాల ఏర్పాటు కోసం దాత గెంటేల వెంకట జోగయ్య పంతులు 4.89ఎకరాల భూమిని ఇచ్చారు. పాఠశాలలో 2.67ఎకరాల్లో ఉన్న క్రీడామైదానంలో కంపచెట్లు, జున్నుగడ్డి పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. క్రీడాస్థలం నిరుపయోగంగా మారడంతో విద్యార్థినులు డ్రిల్లు చేసే పరిస్థితి కూడా లేకుండాపోయింది. దాతలెవ్వరైనా స్పందించి పాఠశాల క్రీడామైదానాన్ని బాగుచేయిస్తే విద్యార్థినులకు ఎంతో మేలుగా ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆలవాల లక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితోనైనా పాలకులు, అధికారులు స్పందించి పాఠశాలలో క్రీడామైదానాన్ని వినియోగంలోకి తెచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. -జగ్గయ్యపేట అర్బన్

ఇసుకాయ స్వాహా



అన్నవరం వద్ద పాలేరు నదిలో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు

- జోరుగా ఇసుక అక్రమ తరలింపు..
- రాత్రీపగలు తేడా లేకుండా ట్రాక్టర్లతో తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

జగ్గయ్యపేట: ఉచిత ఇసుక పేరుతో పాలేరు నదిని పచ్చతోడేళ్ళు బొక్కేస్తున్నాయి. మండలంలోని బూదవాడ, అన్నవరం గ్రామాలకు పాలేరు నది పక్కనే ఉండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇటీవల భారీవర్షాలు, వరదలు రావడంతో పాలేరుకు భారీస్థాయిలో ఇసుక మేటలు వేశాయి. అంతే కాకుండా ఇసుక కూడా నాణ్యతగా ఉండటంతో రాత్రి పగలు తేడా లేకుండా అక్రమరవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

తెలంగాణకు తరలింపు..

బూదవాడ, అన్నవరం గ్రామాలకు కూతవేటు దూరంలోనే తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఉండటం అక్రమార్కులకు ఇసుక సరఫరా సౌలభ్యంగా ఉంటుంది. పాలేరులో ఇసుకను గ్రామాల్లో లబ్ధిదారులకు అవసరం ఉందంటూ దర్జాగా ప్రొకెయిన్లు తీసుకువెళ్లి మరీ ట్రాక్టర్లలో ఇసుకనింపి గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణకు తరలిస్తున్నారు.

కూలీలతో ముఠాలు ఏర్పాటు..

అంతేకాకుండా కొందరు అక్రమార్కులు కూలీలతో ముఠాలు ఏర్పాటు చేశారు. ముఠా కూలీలు ఒక ట్రాక్టరు ట్రక్కుకు ఇసుక నింపినందుకు రూ.400ల నుంచి రూ.900 చెల్లిస్తున్నారు. రోజుకు 50 నుంచి 80 ట్రాక్టర్లు ఇసుక రెడ్లకుంట, కూచిపూడితండా, రామాపురంతండా గ్రామాల మీదుగా తెలంగాణ రాష్ట్రానికి తరలిపోతోంది. ఈ పరిసరాల ప్రాంతాల్లోనే విద్యుత్‌స్తంభాలు తయారుచేసే ఫ్యాక్టరీలకు ఇసుక సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో ట్రక్కు ఇసుక ధర రూ.4వేలు నుంచి రూ.6వేలు పలుకుతుండటంతో ఈ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

అద్దెకు ట్రాక్టర్లు...

ఇసుక డిమాండ్ నేపథ్యంలో పలువురు ఇసుక అక్రమార్కులు చుట్టుప్రక్కల గ్రామాల్లో రైతుల నుంచి అద్దెకు ట్రాక్టర్లు తీసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రోజుకు రూ.1000 నుంచి రూ.1500 చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. ఆయా ట్రాక్టర్ల ద్వారా భారీగా ఇసుకను రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్నారు.

చెక్‌పోస్ట్‌లు ఉన్నా వృథానే..



ట్రాక్టర్ల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని రెడ్లకుంట గ్రామానికి తరలిపోతున్న ఇసుక

బూదవాడ, అన్నవరం గ్రామాల్లో బోర్డర్ చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల వరకు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసిన పోలీసులు ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో ఇసుక అక్రమరవాణాకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు సైతం పట్టించుకోకపోతుండటం అక్రమార్కులకు ఎదురులేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి బూదవాడ, అన్నవరం గ్రామాల సమీపంలోని పాలేరు నుంచి సాగుతున్న ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల వరదలకు జగ్గయ్యపేట మండలం బూదవాడ వద్ద పాలేరులో మేట వేసిన ఇసుక

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి: డీపీఓ



మాట్లాడుతున్న డీపీఓ లావణ్యకుమారి

కంచికచర్ల : గ్రామాలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులను సద్వినియోగం చేసుకుని శానిటేషన్ పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి సూచించారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో కంచికచర్ల, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల పరిధిలోని గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఇంటిపన్నులను 100శాతం వసూలు చేసి గ్రామాభివృద్ధికి పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రతిరోజూ మంచినీటిని సరఫరా చేయాలన్నారు. క్లోరినేషన్ చేపట్టాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి నెలా శుభ్రం చేయించాలని సూచించారు. డ్రైయినేజీల్లో మురుగునీరు పారుదల సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలను తరలించి 15 రోజుల్లోగా వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. అనంతరం మండలంలోని పరిటాలలోని చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి క్లాప్‌మిత్రలతో మాట్లాడారు. సమావేశంలో డీఎల్‌పీఓ మన్నె ప్రసాద్, ఎంపీడీఓ బీ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీలు బొజ్జగాని శ్రీనివాసరావు, ఏసుబాబు, పద్మావతి, మాధవి, రాజు, డివిజన్ పరిధిలోని గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

40అర్జీలు అందజేత



కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామ సచివాలయంలో భూముల రీసర్వేపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ వి.జాహ్నవి మాట్లాడుతూ,ఇటీవల ప్రభుత్వం రైతుల భూములను సర్వే చేసిందన్నారు. ఆ భూముల్లో హద్దులు, కొలతల్లో తేడాలున్నట్లయితే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ భూముల్లో కొలతలు, హద్దుల్లో తేడాలున్నాయని గ్రామసభలో 40మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. గ్రామసభలో వీఆర్వోలు కాంతారావు, బ్రహ్మం, జోజిరాజు, రైతులు పాల్గొన్నారు.

కుంగిన స్త్రీశక్తి భవనం ఫ్లోరింగ్





మండల మహిళా సమైక్య కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో కుంగిన ఫ్లోరింగ్ (ఇన్‌సెట్లో)ఉపాధి హామీ పథకం కార్యాలయంలో కుంగిన ఫ్లోరింగ్

ఇబ్బందుల్లో మహిళలు, సిబ్బంది

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో మండల మహిళా సమైఖ్య భవనం అధ్వాన్నంగా మారింది. 2015లో రూ.28.50లక్షలతో ఈ భవనం నిర్మించారు. ఈ భవనంలో ఓ వైపు మండల మహిళా సమైఖ్య కార్యాలయం, మరోపక్క జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయం నిర్వహిస్తున్నారు. అయితే ఈ భవనంలోని ఫ్లోరింగ్ మొత్తం కుంగిపోయి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మహిళా సమైఖ్య కార్యాలయంలోని మీటింగ్ హాల్ మొత్తం కుంగిపోయి గుంతలు పడటంతో మహిళలు పలు సందార్భల్లో కింద పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. మీటింగ్ హాలు కుంగిపోవడంతో కుర్చీలు వేసి కూర్చోవాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పక్కనే ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో కూడా ఫ్లోరింగ్ మొత్తం కుంగిపోయింది. నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయాలకు వస్తుంటారు. ఫ్లోరింగ్ చూసి వారు ప్రభుత్వ కార్యాలయాలు ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు.

విధుల్లో చేరిక



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పెద్ది మనోహర్ బుధవారం విధుల్లోకి చేరారు. మనోహర్ నందిగామ ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డీటీగా విధులు నిర్వహించిన నీలం నాగరాజు వీరులపాడు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం చిల్లకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తున్నారని అనుమానం వస్తే వెంటనే తెలియజేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ విధులు, పోలీసుల బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.